క్లుప్తంగా

స్టాపర్ల ఏర్పాటు

డెంకాడ: పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు స్టాపర్లు ఎంతగానో దోహదపడతాయని భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా ఎక్కడ జరుగుతాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఎంవీజీఆర్ సౌజన్యంతో సోమవారం స్టాపర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంవీజీఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో మెరుగైన పర్యావరణం



మొక్కలు నాటుతున్న సర్పంచ్ రఘు, తదితరులు

పూసపాటిరేగ: పచ్చదనంతో మెరుగైన పర్యావరణం ఏర్పడుతుందని కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు అన్నారు. మండలంలోని కొవ్వాడలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ దఫాలుగా సుమారు 8 లక్షల రూపాయల విలువైన పది వేల మొక్కలు గ్రామంలో నాటినట్లు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కడియం నుంచి మొక్కలు తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేబార్కి అప్పారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు వస్త్రాలు, పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు జనార్దనరావు, తదితరులు

పూసపాటిరేగ: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రమీలాదేవి, కృష్ణచైతన్య అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ పెద్ద మహంతి జనార్దనరావు సహకారంతో గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు పి. లక్ష్మీనాయుడు, పీడీపీఏ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ వెంకటేష్

విజయనగరం ఫోర్ట్: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సాయినాథ్ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. స్థానిక యూపీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని.. తద్వారా ఆరోగ్యకర సమాజం నెలకొంటుందని చెప్పారు. అనంతరం ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి పాటుపడతామని వైద్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ నేచురోపతి డాక్టర్ చైతన్యస్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మీరు చెప్పే పనులు చేయలేం..

- కార్పొరేషన్ కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు

విజయనగరం: మీరు చెప్పే విధులు మేము చేయలేమంటూ వార్డు సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వపరంగా సచివాలయ ఉద్యోగులపై పెంచుతున్న పనిభారాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో స్థానికంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్ నుంచి వైదొలుగుతున్నట్లు వెల్లడించారు.

డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

విజయనగరం ఫోర్ట్: రైతులను మోసగించిన విత్తన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజాం మండలం రామినాయుడువలస, అమరాం గ్రామాల్లో 150 ఎకరాల్లో వరి పంటను రైతులు నష్ట పోయారన్నారు. గంగోత్రి అనే వరి విత్తనాలను గడ్డిముడిదాం గ్రామానికి చెందిన డీలర్ దగ్గర రైతులు కొనుగోలు చేశారని, అయితే ఆ పంటంతా కేళీలు రావడంతో అన్నదాతలు పూర్తిగా నష్టపోయారని చెప్పారు. అధికారులు విచారణ చేపట్టి డీలర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణ, మారాపు రామభగవాన్‌దాసు, గణపతిరావు, దత్తి ఆదినారాయణ, గుల్లిపల్లి మహేస్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. నమోస్తుతే..



వనంగుడిలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గాదేవి



సరస్వతీమాతగా కనకమహాలక్ష్మి



కాళికాదుర్గా మాత వద్ద పుస్తకాలతో పూజలు నిర్వహించిన కమిటీ ప్రతినిధులు



ప్రవచనం అందిస్తున్న డాక్టర్ స్వప్న హైందవి



గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి పర్వదినాలలో భాగంగా వాడవాడలా ఏర్పాటుచేసిన దుర్గాదేవి మంటపాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనంగుడిలో కొలువైన దుర్గాదేవి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్, అర్చకులు నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. అదేవిధంగా సిటీబస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారు సరస్వతీమాతగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో వందలాది పుస్తకాలను ఉంచి సరస్వతీమాతకు పూజలు చేపట్టారు. రైల్వేస్టేషన్ రోడ్డు గాడీఖానాలో శక్తిస్వరూపిణి కాళికామాతగా కొలువుదీరిన దుర్గమ్మ వద్ద సరస్వతీదేవి పూజలు నిర్వహించి, పుస్తకాలను చిన్నారులకు అందజేశారు. కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి నేతృత్వంలో చిన్నారులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా హజరత్ ఖాదర్ వలీ బాబా ఆశ్రమంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతోనే మానవ మనుగడ..

విజయనగరం టౌన్/రూరల్: విద్యతోనే మానవ మనుగడ సాధ్యమని రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఆధ్యాత్మిక శిరోమణి డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి అన్నారు. స్థానిక రామానారాయణం ప్రాంగణంలో సరస్వతీ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాన్ని భక్తులకు అందించారు. శరన్నవరాత్రి పర్వదినాలలో అమ్మవారు రోజుకో అవతారంతో భక్తులను ఆశీర్వదిస్తుంటారని, అందులోనూ మూలానక్షత్రం రోజున ఆ తల్లి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. అనంతరం రామనారాయణం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. అంతకుముందు జ్ఞాన సరస్వతి అమ్మవారికి వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం విద్యార్థులచే వేదపారాయణం, ఆలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష, కృష్ణతేజల ఆధ్వర్యంలో విశేష కుంకుమార్చనలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

- మధ్యాహ్న భోజన నిర్వాహకుల నిరసన



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఆందోళన

విజయనగరం గంటస్తంభం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో నిర్వాహకులు నినాదాలు చేయడంతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలు, మాజీల పెన్షన్లు పెంచుతున్న ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యల పరిష్కారంలో మాత్రం చేతులు ఎత్తేస్తోందని మండిపడ్డారు. రోజుకు కేవలం 100 రూపాయలతో జీవనం కొనసాగించడం అసాధ్యమని.. నిర్వాహకులకు కనీసం రూ.10 వేల గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలకు రూ.20, ఉన్నత పాఠశాలకు రూ.30 మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.రామలక్ష్మి, నారాయణమ్మ, లక్ష్మి, రమణమ్మ, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

సీఐటీయూ ఆధ్వర్యంలో వంట నిర్వాహకులు జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టి ర్యాలీగా డీఈఓ కార్యాలయం వరకు వెళ్లారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధారాణి మాట్లాడుతూ, మూడు నెలలుగా జీతాలు, బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనం రూ. పది వేలు ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపి గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగలక్ష్మి, పార్వతి, ఈశ్వరమ్మ, పైడిరాజు, ముత్యాలమ్మ, ఏ.జగన్మోహనరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్, డీఈఓలకు వినతిపత్రాలు అందజేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: పైడితల్లి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పది అంశాలను అజెండాలో పొందుపరచగా.. సభ్యులు ఆమోదించారు. పైడితల్లి జాతర నేపథ్యంలో కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. వీధి దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య పనులపై దృష్టి సారించామని చెప్పారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. ఉత్సవాలు విజయవంతం కావడానికి అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, జీవీ రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మీడియాపై అనుచిత వ్యాఖ్యలు తగవు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు



అంబళ్ల శ్రీరాములునాయుడు

నెల్లిమర్ల: ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త లోకం ప్రసాద్ మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, నెల్లిమర్ల ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. సోమవారం వారు తమ నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. పదవి లేని ప్రసాద్ వివిధ శాఖల అధికారులతో రివ్యూలు చేయడం, రికార్డులు తెమ్మనడం ఎంతవరకు సమంజసమన్నారు. వీటిపై మీడియాలో కథనాలు ప్రచురితమైతే.. ఏకంగా మీడియా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మీడియా సమావేశం పేరిట జర్నలిస్టులను పిలిచి బెదిరించడం తగదని హెచ్చరించారు. పత్రికల్లో, టీవీ చానళ్లలో వస్తున్న వార్తలు అవాస్తవాలైతే నిరూపించుకోవాలే కాని.. మీడియాను దూషించడం తగదన్నారు.ఈ విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం



విజయనగరం టౌన్: నగరంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో పైడితల్లి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం చండీయాగం నిర్వహించారు. వేద పండితులు సాయికిరణ్, వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా యాగ ప్రక్రియను నిర్వహించారు. అనంతరం యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

నేడు పైడితల్లి దర్శనాలు గంటరన్నర నిలిపివేత

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక భోగాలు పెట్టనున్న నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి రెండున్నర వరకు దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి. త్రినాథర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నేపథ్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి , ఆర్టీసీ కాలనీ, గౌతమీనగర్, ఉడా కాలనీ ఫేజ్-1, మహాలక్ష్మీనగర్, ఆదిత్యనగర్, సాలిపేట, గోకపేట, ఆర్అండ్‌బీ జంక్షన్ , వివేకానంద కాలనీ, ఎల్‌బీ కాలనీ, సెయింట్ జోసెఫ్ స్కూల్ ఏరియా ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఏఈ పిచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మొయిద, నారాయణపట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని చింతలపేట, పెదమజ్జిపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

- కమిషనర్ పల్లి నల్లనయ్య



విక్రయదారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని వీధి విక్రయదారులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య దిశా నిర్దేశం చేశారు. శనివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో లోక్ కల్యాణ్ మేళాను ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అలాగే డిజిటల్ లావాదేవీల ప్రక్రియను గమనించారు. అనంతరం జరిగిన సమావేశంలో వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి స్వనిధి 2.0 ప్రారంభించిన నేపథ్యంలో వీధి విక్రయదారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజితాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 150 రూపాయలు చెల్లించి గుర్తింపు కార్డును పొందాలన్నారు. అలాగే తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి మరింత ఆర్థిక సహకారానికి బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి, ఫుడ్ సేఫ్టీ అధికారి మీరా, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్, టీపీఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్న వారితో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి, పూసపాటిరేగ మండలంలోని పూసపాటిపాలెంనకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు 1, 95, 361 రూపాయల విలువైన చెక్కులను ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పోలిపల్లిలోని తన స్వగృహంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, క్లస్టర్ ఇన్‌చార్జ్ దంగా భూలోక, పూసపాటిపాలెం సర్పంచ్ రౌతు సోమినాయుడు, గుంపాం మాజీ సర్పంచ్ కొత్తకోట వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా బురదనీరు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించిన సభ్యులు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 5, 6, 7 వార్డులకు కుళాయిల ద్వారా బురదనీరు సరఫరా అవుతోందని, సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద స్విచ్‌లు సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో ప్రమాదం పొంచి ఉందని కౌన్సిలర్ లెంక హైమావతి సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ప్రధాన మురుగునీటి కాలువల్లో పూడికలు తొలగించాలని ముడిమంచి లక్ష్మి కోరారు. మున్సిపల్ సిబ్బందిలో కొంతమంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని పలువురు సభ్యులు ప్రస్తావించారు. నగర పంచాయతీలో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో కౌన్సిలర్లకు ప్రొటోకాల్ పరంగా ప్రాధాన్యత ఇవ్వాలని మొయిద శ్రీనివాసవాసరావు అన్నారు. కమిషనర్ జయరామ్ మాట్లాడుతూ.. సభ్యులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఓపెన్ జిమ్ పరికరాలు గాంధీనగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు, జనా సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీలో మెరిసిన దివ్యాంగుడు

- సింహాచలం నాయుడిని అభినందించిన కలెక్టర్



విభిన్న ప్రతిభావంతుడు జామి సింహాచలంను అభినందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట(విశాఖ): పుట్టుకతోనే రెండు చేతుల అంగవైకల్యం ఉన్నా, ఎడమ కాలుతో పరీక్ష రాసి మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం (ఎస్జీటీ) సాధించిన జామి సింహాచలం నాయుడును కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ అభినందించారు. కష్టపడి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విజయనగరం జిల్లా గనిశెట్టిపాలేనికి చెందిన నాయుడు.. రాష్ట్ర స్థాయిలో 320వ ర్యాంకు సాధించగా, దివ్యాంగుల కేటగిరీలో 4వ ర్యాంకు వచ్చింది. ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ వ్యాయమం చేయాలని, దీనివల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కోట వద్ద నిర్వహించిన ర్యాలీని సోమవారం ఆయన జెండా ఊపి ప్రా రంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానవుని అవయవాల్లో గుండె అత్యంత ప్రధా నమైనదన్నారు. దీన్ని పరిరక్షించుకోవాల్సిన అవశ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్, డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ కిరణ్, డాక్టర్ దుర్గాప్రసాద్, ఆస్పత్రి సెంటర్ హెడ్ మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్ ప్రారంభం

విజయనగరం టౌన్: నగరంలోని మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఇటువంటి ఎగ్జిబిషన్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సుమారు 244 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున ఇటువంటి బజార్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఎన్‌సీసీ సీఏటీసీ - 5 శిక్షణ ప్రారంభం

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిబిరం-5 కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అక్టోబర్ 7వ తేదీ వరకు పది రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఎన్‌సీసీ విశాఖ గ్రూప్ కమాండర్ కమోడోర్ సుమంత్‌రాయ్, ఆంధ్ర కాంపోజిట్ టెక్నికల్ రెజిమెంట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన సుమారు 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాడెట్లకు పరేడ్ డ్రిల్, ఆయుధ శిక్షణ, శారీరక దారుఢ్యం, మానసిక ధైర్యం, నాయకత్వ నైపుణ్యాలు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డిప్యూటీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ గుంటముక్కల భద్రయ్య మాట్లాడుతూ.. ఈ శిబిరం ద్వారా క్యాడెట్లలో జాతీయ భావన, క్రమశిక్షణ, సమాజ సేవాస్ఫూర్తి పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ ప్రశాంత్, లెఫ్టినెంట్ కృష్ణకిషోర్, లెఫ్టినెంట్ లక్ష్మి, మణికంఠ, సీఈఓ సతీష్, వాసు, సౌమ్య, సీఎస్ఓ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ మహేశ్వర, ఎస్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు


చంద్రమ్మ పేరంటాలకు సారె సమర్పణ



పూసపాటిరేగ: సారె తీసుకువెళ్తున్న భక్తులు



నెల్లిమర్ల: దుర్గమ్మకు సమర్పించిన సారె



అమ్మవారికి సారె, ఘటాలను సమర్పిస్తున్న భక్తులు, భవానీ దీక్షాపరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని చంద్రమ్మ సుందరమ్మ పేరంటాలుకు సోమవారం సారె సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు సారెతో ఊరేగింపుగా గుడికి వెళ్లారు. అనంతరం గుడిలో ప్రత్యేక పూజలు చేశారు.

నెల్లిమర్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఉత్సవాల నిర్వాహకులు, స్థానిక భక్తులు దుర్గమ్మకు వివిధ రకాల స్వీట్లు, పిండివంటలు, పండ్లు నైవేద్యంగా పెట్టారు. ఈ సందర్భంగా భవానీ మాలధారులు అమ్మవారి సన్నిధిలో భజనలు చేశారు.

విజయనగరం టౌన్: విజయనగరం 38వ డివిజన్ బొబ్బాదిపేటలో కొలువుదీరిన దుర్గాదేవికి సోమవారం సరస్వతీ పూజలు జరిపారు. మహిళలు, భవానీ దీక్షాపరులు సారె, ఘటాలను సమర్పించారు.